చిట్టి బుర్రల్లో.. గొప్ప ఆలోచనలు..

నేషనల్ సైన్స్ డే సందర్భంగా స్కూళ్లలో ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్స్

వినూత్న ఆవిష్కరణలు, పరిశోధనలతో చిన్నారులను భవిష్యత్ శాస్త్రవేత్తలను తీర్చిదిద్దే వేదికలు 'వైజ్ఞానిక ప్రదర్శనలు'.. విద్యార్థుల పరిశీలన, ఆలోచన, ప్రయోగాల ఫలితమే నూతన ఆవిష్కరణలు.. సమాజం, పర్యావరణంలో ఎన్నో సమస్యల పరిష్కారం దిశగా తక్కువ ఖర్చుతో విద్యార్థులు చేస్తున్న ప్రయోగాలు, పరిశోధనలకు సైన్స్ ఫెయిర్స్ వేదికలు కావడంతో చిట్టి బుర్రల్లోంచి పుట్టుకొస్తున్న ఎగ్జిబిట్లు ఆలోచింపజేస్తున్నాయి. విజ్ఞానంతో కూడిన ఆరోగ్యకరమైన పోటీతో విద్యార్థులు స్ఫూర్తి పొందుతూ ముందుకు సాగుతున్నారు. బుధవారం పలు స్కూళ్లలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్లలో చిన్నారి శాస్త్రవేత్తలపై అతిథులు, తల్లిదండ్రులు ప్రశంసల వర్షం కురిపించారు. – ఉప్పల్, మల్కాజిగిరి జోన్ బృందం

కుషాయిగూడ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో..



కుషాయిగూడ: నోబెల్ గ్రహీత సీవీ రామన్ జయంతిని పురస్కరించుకొని బుధవారం కుషాయిగూడలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. విద్యార్థులు తయారు చేసిన హైడ్రాలిక్ క్రేన్, విండ్ పవర్, నీటిశుద్ధి యంత్రం పనితీరు వంటి పలు ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

విజ్ఞాన్ సైంటిఫిక్ స్కూల్‌లో..



సీవీ రామన్ జయంతి సందర్భంగా చర్లపల్లి, ఈసీనగర్‌లోని విజ్ఞాన్ సైంటిఫిక్ స్కూల్‌లో స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో బుధవారం సైన్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం స్ఫూర్తి బాధ్యులు పి.జయప్రకాశ్ మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞానం ఆవశ్యకతను వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ శరత్, ప్రిన్సిపల్ టానియా, యాదగిరిరావు, శివప్రసాద్, రాజమల్లు, గిరిశం తదితరులు పాల్గొన్నారు.

రామంతాపూర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో..



రామంతాపూర్: జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన వైజ్ఞానిక నమూనాల ప్రదర్శనను కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు బుధవారం ప్రారంభించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఐఎఫ్ఎస్ స్కూల్‌లో..

మౌలాలి: నేషనల్ సైన్స్ డే పురస్కరించుకొని మౌలాలిలో ఉన్న ఐఎఫ్ఎస్ స్కూల్‌లో బుధవారం వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి కార్పొరేటర్ సునీతశేఖర్ యాదవ్ హాజరై విద్యార్థుల నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ రేష్మాబేగం, ఉపాధ్యాయులు తరనుమ్, సంతోషిణి, అఫ్రిన్ నాజ్, ఐశ్వర్య, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యాజ్యోతి ఉన్నత పాఠశాలలో..



సైన్స్ నమూనాలను తిలకిస్తున్న డైరెక్టర్లు

సైన్స్ మన జీవితంలో ముఖ్య పాత్ర పోషిస్తుందని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల డైరెక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. చెంగిచర్ల ధరణి కాలనీలోని విద్యాజ్యోతి స్కూల్ బుధవారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో డైరెక్టర్లు అనిల్ అయ్యంగార్, వరప్రసాద్, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

బోడుప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

బోడుప్పల్: బోడుప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తమ ప్రతిభకు పదును పెట్టి విజ్ఞాన నమూనాలను తయారు చేశారు. ప్రధానోపాధ్యాయులు పెద్ది దామోదర్, విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయులు రాంప్రసాద్, వెంకటేశ్, వజన, శ్రీదేవి, భాగ్యలక్ష్మి, అశోక్, మధుమోహన్, యాదయ్య, సరస్వతి, విద్యాసాగర్ తిలకించారు.



నమూనాలను తిలకిస్తున్న దామోదర్

త్రివేణి స్కూల్‌లో..



అల్వాల్: నేషనల్ సైన్స్ డే పురస్కరించుకొని అల్వాల్‌లోని త్రివేణి స్కూల్‌లో బుధవారం సైన్స్ ఫెస్ట్ నిర్వహించారు. సైన్స్ ఫెస్ట్‌లో విద్యార్థులు 350 ప్రాజెక్టులతో సందడి చేశారు. అల్వాల్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిరెడ్డి హాజరై విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను తిలకించారు. త్రివేణి స్కూల్ ప్రిన్సిపల్ శ్రీసుధ, సైన్స్ అధికారి సుబ్బారావు, ఉపాధ్యాయులు సరిత, రాములు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పల్లవి స్కూల్‌లో..

నేషనల్ సైన్స్ డే పురస్కరించుకొని అల్వాల్‌లోని పల్లవి ప్రొగ్రెసివ్ స్కూల్‌లో బుధవారం సైన్స్ ఫేర్ నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ మాధవరెడ్డి, ప్రిన్సిపల్ స్వర్ణలత హాజరై విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను తిలకించారు. అనంతరం వారు సైన్స్ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



పల్లవి ప్రొగ్రెసివ్ స్కూల్‌లో సైన్స్ ఫెయిర్

గౌతంనగర్ భాష్యం పాఠశాలలో..

గౌతంనగర్: విద్యార్థులు సృజనాత్మకతను పెంచుకోవాలని ఎస్ఐ కొండల్‌రావు అన్నారు. నేషనల్ సైన్స్ డే పురస్కరించుకొని గౌతంనగర్‌లోని భాష్యం పాఠశాలలో బుధవారం వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఎస్ఐ కొండల్‌రావు, పాఠశాల జెడ్‌ఈవో మార్కెండేయులు హాజరై వైజ్ఞానిక ప్రదర్శనలో నమూనాలను తిలకించారు. అయోధ్య రామమందిరం, సిటీ అండ్ విలేజ్ మోడల్, పార్కు, థర్మల్ వాటర్‌ప్లాంట్, డ్యామ్ తదితర నమూనాలను ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కోమలి, కో–ఆర్డినేటర్ వనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



భాష్యం స్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శనలో నమూనాలు

కాకతీయ స్కూల్‌లో..



గణేష్‌నగర్‌లోని కాకతీయ స్కూల్‌లో విజ్ఞాన దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ వైభవి హెచ్ఎం రవీందర్, ప్రముఖ భారతీయ శాస్త్రవేత్తలు అబ్దుల్ కలాం ఆజాద్, చంద్రబోస్, సి.వి.రామన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో..



ప్రసంగిస్తున్న శాస్త్రవేత్త వెంకట్ నారాయణ

రామంతాపూర్: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం నిర్వహించిన సైన్స్ డేకు ముఖ్య అతిథిగా ఇస్రో అంతరిక్ష కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ గంజి వెంకట నారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్ మేధా సంపద గణనీయంగా వృద్ధి చెందిందని, భవిష్యత్‌లో ప్రపంచంలోని అన్ని దేశాల్లో మన దేశానికి చెందిన శాస్త్రవేత్తలే ఎక్కువ మంది ఉంటారన్నారు. రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ సెక్రటరీ పుల్లయ్య, ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

అందరూ ప్రశాంత జీవితాన్ని గడపాలి



స్వామి వేడుకల్లో భక్తులు

బోడుప్పల్: సమాజంలో ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ప్రశాంత జీవితాన్ని గడపాలని పన్నాల కృష్ణారెడ్డి అన్నారు. బోడుప్పల్ పన్నాల రవీందర్‌రెడ్డి కాలనీలోని శ్రీకృష్ణ దేవాలయంలో బుధవారం నిర్వహించిన సుదర్శన నారసింహ హోమం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు రోజులుగా సప్తాహ్నిక పంచ కుండాత్మక పుష్కర బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొననున్నట్లు వెల్లడించారు. 2వ తేదీన జరిగే వసంతోత్సవం, శ్రీపుష్ప యాగానికి శ్రీత్రిదండి చిన్న జీయర్‌స్వామి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు వెల్లడించారు. ఆలయ ప్రధాన అర్చకులు చక్రవర్తుల సద్గుణాచార్యులు, అంజి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ రజిత పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్: ఉప్పల్ డివిజన్ వెంకటేశ్వర కాలనీలో రూ.60 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు బుధవారం కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్‌రెడ్డి స్థానికులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో ఎక్కడ ఏ సమస్య ఉన్నా స్వయంగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దడానికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీఈ నిఖిల్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు సతీష్‌గౌడ్, జగన్, శ్రీధర్, విజయ్, భాస్కర్, కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివస్వాముల పూజ



మల్లాపూర్: న్యూభవానీనగర్‌లోని గురుస్వాములు బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి, విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో బుధవారం శివపూజ చేశారు. శివనామస్మరణతో ఆ ప్రాంగణం అంతా మార్మోగింది. కార్యక్రమంలో బుసిరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, మహేందర్‌గౌడ్, జైపాల్‌రెడ్డి, గోపాల్‌స్వామి, నర్సింహస్వామి, తిరుపతి స్వామి, బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి ముత్యంరెడ్డి, ధర్మారెడ్డి పాల్గొన్నారు.

మైనంపల్లికి సన్మానం



మాజీ ఎమ్మెల్యే మైనంపల్లితో ముత్యాలరావు సొసైటీ సభ్యులు

అల్వాల్: నేరేడ్‌మెట్ ముత్యాలరావు కో–ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు డీఎల్ఎన్ రెడ్డి, సభ్యులు బుధవారం మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సొసైటీ సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో ముత్యాలరావు కో–ఆపరేటివ్ సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక టెక్నాలజీతో సర్వే



జ్యోతి వెలిగించి సైన్స్ డేని ప్రారంభిస్తున్న చీఫ్ బ్రిడ్జి ఇంజినీర్ ప్రదీప్‌గుప్తా తదితరులు

ఉప్పల్: ఉప్పల్ సర్వే ఆఫ్ ఇండియాలో బుధవారం సైన్స్ డేను నిర్వహించారు. ముఖ్య అతిథిగా చీఫ్ బ్రిడ్జి ఇంజినీర్ ప్రదీప్‌గుప్తా(ఐఆర్ఎస్) పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్ సీవీ రామన్ ఎఫెక్ట్‌ను కనిపెట్టిన రోజును సైన్స్ డేగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాత పద్ధతుల్లో సర్వే చేయడం కాకుండా అత్యాధునిక యంత్రాలు, లేటెస్ట్ టెక్నాలజీని వాడుతూ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చాట్ జీపీ టెక్నాలజీని వాడుతూ డ్రోన్ల ద్వారా సర్వే చేస్తూ ఖచ్చితమైన ఫలితాలను పొందుతున్నట్లు ఆయన వివరించారు. దేశంలో 1072 కోర్సు నెట్‌వర్క్ స్టేషన్లు ఉన్నాయని తెలంగాణలో 35 కోర్సు స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో రాజమండ్రి నుంచి గోదావరి బ్రిడ్జి ఆధునీకరణలో ఈ సరి కొత్త టెక్నాలజీని వాడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జి.వరుణ్ కుమార్, టీపీ మాలిక్ ఎస్‌పీజీ డైరెక్టర్, రమేష్, కామేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వందలాదిగా తరలివచ్చిన విద్యార్థులు

నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు సర్వే ఆఫ్ ఇండియాను సందర్శించారు. సర్వే అండ్ మ్యాపింగ్‌లో వచ్చిన నూతన టెక్నాలజీ, సర్వేకు ఉపయోగించే ఆధునిక పరకరాలు అవి పని చేసే తీరును కార్యాలయ సిబ్బంది విద్యార్థులకు వివరించారు. దాదాపు నగరం నలుమూలల నుంచి 2,500 మంది విద్యార్థులు హాజరైనట్లు అడిషనల్ సర్వేయర్ జనరల్ డా.సాలిన్ తెలిపారు.

17వ డివిజన్ అభివృద్ధికి రూ.4.66 కోట్లు



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్

బోడుప్పల్: 17వ డివిజన్ పరిధిలో గడిచిన నాలుగేళ్లలో రూ.4.66 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు కార్పొరేటర్ పోగుల నర్సింహారెడ్డి వెల్లడించారు. నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ రూ.2.67 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, ఎస్సీ శ్మశానవాటికలో టాయిలెట్స్, శ్మశానవాటికలో పచ్చదనాన్ని పెంచేందుకు, ఇతర మరమ్మతులకు 38.30 లక్షలు, పార్కు ప్రహరీ గోడ నిర్మాణానికి, అభివృద్ధి కోసం, మొక్కలు పెంచడం కోసం రూ.74.90 లక్షలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, డ్రైనేజీ పైపులైన్లు, స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ కోసం, అవెన్యూ ప్లాంటేషన్ కోసం రూ.85.61 లక్షలు, సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.5 లక్షలు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. డివిజన్‌లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తూ ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే డివిజన్ ప్రజలకు తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్లు, పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. డివిజన్‌లో మిగిలిపోయిన పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



మల్లాపూర్: నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. హబ్సిగూడ, నాచారం ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఏడు పరీక్షా కేంద్రాలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సందడిగా కనిపించాయి.

డెలివరీ సర్వీస్‌లో అమెజాన్ రికార్డ్

సాక్షి, సిటీబ్యూరో: సముద్ర మట్టానికి 4,500 అడుగుల ఎత్తులో ఉన్న ప్రాంతానికి డెలివరీ చేయడం ద్వారా ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ అమెజాన్.. రికార్డ్ సృష్టించింది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు ఓ సమావేశంలో తెలిపారు. ధ్యాన అభ్యాసకులకు స్వర్గధామమైన ఉత్తరకాశీ సమీపంలోని గజోలి పర్వత ప్రాంతంలో ఉన్న మహర్షి ఆశ్రమానికి డెలివరీ ద్వారా ఈ ఫీట్ సాధించామన్నారు. ఎత్తయిన కొండలు, కొండ చరియలు, పీఠభూములతో కూడిన భూభాగంలో 3 కిలో మీటర్ల ట్రెక్‌ను కలిగి ఉన్న మహర్షి ఆశ్రమానికి డెలివరీ చేసిన మొదటి ఏకైక ఇ-కామర్స్ కంపెనీ తమదేనన్నారు.

సూసైడ్ నోటు రాసి అదృశ్యం



శివరామ్ కుమార్(ఫైల్)

అల్వాల్: ఉద్యోగ శిక్షణకు వెళ్తున్నానంటూ ఇంట్లో చెప్పి వెళ్లిన ప్రైవేటు ఉద్యోగి అదృశ్యమైన ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ. సురేష్ తెలిపిన వివరాల ప్రకారం అల్వాల్ సూర్యనగర్‌లో నివాసముండే శివరామ్‌కుమార్(44) ప్రైవేటు ఉద్యోగం చేస్తుంటాడు. 26వ తేదీన తనకు జహీరాబాద్‌లో శిక్షణ ఉందంటూ ఇంట్లో చెప్పి ట్యాక్సీ తీసుకొని వెళ్లిపోయాడు. ఇంట్లో సూసైడ్ నోట్ కుటుంబ సభ్యులకు కనిపించింది. దీంతో కుటుంబ సభ్యులు అల్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా గత నెలలో శివరామ్‌కుమార్‌పై మేనల్లుడి కిడ్నాప్ కేసు నమోదైంది. ఈ కేసులో రిమాండ్‌కు వెళ్లి వచ్చాడు. పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బ్యూటీషియన్..



కళ్యాణి(ఫైల్)

మహిళ అదృశ్యమైన సంఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వినాయక్‌నగర్ రామ్‌బ్రహ్మనగర్‌కు చెందిన ఏబీ.నర్సింహ, భార్య కళ్యాణి(22) బ్యూటీషియన్. 26వ తేదీన భార్యభర్తలకు గొడవ జరిగింది. 27వ తేదీన ఉదయం 4 గంటలకు ఇంటికి తాళం వేసి ఇంటి నుంచి బయటకు వెళ్లింది. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మౌలిక వసతులు కల్పిస్తాం



కమ్యూనిటీ హాల్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: డివిజన్ పరిధిలో అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మల్లాపూర్ డివిజన్ పరిధిలో రూ.1.76 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. నెహ్రూనగర్‌లో రూ.1.20 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అశోక్‌నగర్‌లో భూగర్భ డ్రైనేజీ కోసం రూ.9.80 లక్షలు, గోకుల్‌నగర్‌లో కమ్యూనిటీ హాల్ పెండింగ్ పనులకు రూ.46.50 లక్షల వ్యయంతో చేపట్టబోయే పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్లు, అధికారులను ఆదేశించారు. డీఈ రూప, ఏఈ సవంత్రి, వర్క్ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, రామారావు, కాలనీల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే

బట్టలు కుడుతూ ఉపాధి పొందుతున్న దర్జీలను ప్రభుత్వం ఆదుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. టైలర్స్ డే సందర్భంగా మల్లాపూర్ అంబేడ్కర్ భవన్‌లో శ్రీమాత గార్మెంట్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం టైలర్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రేటర్ నేత సాయిజెన్‌శేఖర్ హాజరయ్యారు. శ్రీమాత గార్మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు బి.రామసుబ్బయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి భిక్షపతి, కోశాధికారి తిరుపతి, ఉపాధ్యక్షులు హరికృష్ణ, సమ్మయ్య, నాటరాజు, మచ్చ శ్రీను, బొమ్మ శ్రీను పాల్గొన్నారు.

సెయింట్ ఆల్ఫోన్సస్ స్కూల్ వార్షికోత్సవం



సెయింట్ ఆల్ఫోన్సస్ స్కూల్ వార్షికోత్సవంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

అల్వాల్: ఓల్డ్ అల్వాల్‌లోని సెయింట్ ఆల్ఫోన్సస్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నేషనల్ బెస్ట్ ఎడ్యుకేషనల్ ఫిల్మ్ అవార్డు గ్రహీత, నోటెడ్ ఫీచర్ ఫిల్మ్ డైరెక్టర్ శ్రీకాంత్ కుమార్ హాజరై వేడుకలను ప్రారంభించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మెమొంటోలు అందజేశారు. స్కూల్ కరెస్పాండెంట్ జెరార్డ్ శామ్యూల్, ప్రిన్సిపల్ చంద్రమోహన్, తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి యాదగిరి, జాయింట్ ట్రెజరర్ ఇన్నారెడ్డి, మేడ్చల్ జిల్లా జనరల్ సెక్రటరీ నాగరాజు, కోశాధికారి అజర్‌ఖాన్, అల్వాల్ మండల ఉపాధ్యక్షుడు మోజెస్, స్కూల్ హెడ్‌మాస్టర్ సతీష్, ఇన్‌చార్జిలు జనార్దర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యోగులను రప్పించాలని వినతి



వేం.నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేసిన సంఘం నాయకులు

మల్కాజిగిరి: అంతరాష్ట్ర బదిలీలు చేపట్టిన తర్వాత మిగిలిపోయిన పోస్టుల్లో జిల్లా, జోనల్, మల్టీ జోనల్ స్థాయిలో ఏపీలో పనిచేస్తున్న తెలంగాణ స్థానికత ఉన్న ఉద్యోగులను రప్పించాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం.నరేందర్‌రెడ్డికి అసోసియేషన్ తరఫున వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, రమేష్ మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడి పది సంవత్సరాలు పూర్తవుతున్నా ఇప్పటికీ అక్కడ ఉద్యోగం చేస్తుండటం వలన ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ చూపి ఉద్యోగులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు.

కార్పొరేటర్‌ను కలిసిన ప్రాజెక్టు ఆఫీసర్



కుషాయిగూడ: కాప్రా మున్సిపల్ కార్యాలయానికి బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించిన ప్రాజెక్టు ఆఫీసర్ దామోదర్‌రెడ్డి బుధవారం చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు బొకే అందజేశారు. ఆయన వెంట సీఓ గోపాల్‌రెడ్డి, స్వామిదాస్ తదితరులు ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కుషాయిగూడ: ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. చర్లపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోని హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎం పక్కన ఓ గుర్తు తెలియని వ్యక్తి తల పగిలి రక్తస్రావమవుతున్న స్థితిలో పడి ఉన్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటన స్థలానికి చేరుకొని 108లో ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కాగా మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా భావించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించామని ఎస్ఐ తెలిపారు. మృతుడికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే.. ఫోన్: 87126 62722, 87126 62788.